మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



యాడికి మండల కేంద్రానికి పోయే రోడ్డు మలుపు



ప్రమాదకరంగా ఆదర్శ స్కూల్‌కు పోయే రోడ్డు మలుపు

- సూచికలు లేక ప్రమాదాల బారిన వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

యాడికి: మండలంలోని పలు మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల్లోని ప్రమాదకర మలుపుల, వంతెనలు వద్ద సూచికల ఏర్పాటు చేయక పోవటంతో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటు చేసుకుని ప్రాణాలు పోతున్నా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. సూచికలు లేక రాత్రిళ్ల వేగంగా వచ్చే వాహన చోదకులకు మలుపులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధానంగా మండలంలోని గుడిపాడు, కుందనకోట, పచ్చారు మేకల పల్లి, చందనలో దైవాలమడుగుకు పోయే రహదారి, వెంగన్నపల్లి. వేములపాడు, కేశవ రాయుని పేట,బోయరెడ్డిపల్లి, చిక్కేపల్లి, వీరారెడ్డి పల్లి తదితర గ్రామాల వరకూ మలుపులు ఎక్కువగా ఉన్నాయి. అలాగే రాయలచెరువు, వేములపాడు, తాడిపత్రికి పోయే హైవే రోడ్డులో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా చోట్ల వద్ద ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు. రాత్రి వేళల్లో హైవేపై లైట్లు లేకపోవడంతో పశువులు, గొర్రెలను ఢీ కొట్టి మృతిచెందిన వారు, క్షతగాత్రులైన వారు చాలా మంది ఉన్నారు. అంతే గాకుండా రహదారుల వెంట ముళ్లపొదలు చిట్టడవిని తలపించేలా ఉన్నాయి. ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖలకు సంబంధించిన రహదారులు, ప్రమాదకరంగా ఉన్నా సూచికలు ఏర్పాటు చేయటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమాదాలు జరగకుండా చూడాలి



మండలంలోని పలు గ్రామాల్లో మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆ రహదారుల వద్దకు వెళ్లగానే భయంగా ఉంటుంది. సూచిక బోర్డులు లేక చాలా మంది ప్రమాదాల బారిన పడ్డారు. రోడ్డు గుంతలు పడి ధ్వంసమైనా అధికారులు పట్టించుకోవడం లేదు. వాహన చోదకుల ఇబ్బందులను తొలగించాలి.

– దేవేంద్ర యాదవ్, పుప్పాల గ్రామం

రెండు రోజుల క్రితం నంద్యాల జిల్లా ప్యాపిలి మండల కేంద్రం నుంచి వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడికి దైవాలమడుగు–చందన గ్రామాల మధ్యలో మలుపుల వద్ద సూచిక బోర్డు కనిపించక ద్విచక్ర వాహనం వ్యవసాయ పొలాల్లోకి పల్టీలు కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే స్థలంలో 30 ఏళ్ల క్రితం డోన్ నుంచి వస్తున్న ఓ ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగి ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడిన సంగతి అందరికీ తెలిసిందే.

గతంలో రాయల చెరువు తాడిపత్రి రహదారి మధ్యలో ఉన్న మోడల్ స్కూల్ నుంచి యాడికి మండల కేంద్రానికి పోయే రహదారి గుండా మండలంలోని పిన్నేపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ తన తమ్ముడితో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మలుపుల క్రాస్ వద్ద యాడికి నుంచి వచ్చే లారీ ఢీ కొంది. ఘటనలో మహిళ మృతి చెందగా ఆమె తమ్ముడు గాయాలతో బయటపడ్డాడు. ఇలా నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు మలుపుల వద్ద, క్రాసింగ్‌ల వద్ద, జంక్షన్లలో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా గుర్తులు వేయడంతోపాటు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశాంత జీవనం సాగించాలి

గుంతకల్లుటౌన్: ప్రతిఒక్కరూ ప్రశాంత జీవనం సాగించాలని వన్‌టౌన్ సీఐ మనోహర్ సూచించారు. పట్టణంలోని షికారీ కాలనీలో శనివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. రికార్డు ల్లేని ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అక్రమ మద్యం, నాటుసారా, మత్తు పదార్థాలను విక్రయించరాదని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. టూటౌన్ సీఐ మస్తాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామమైన చీమలవాగుపల్లిలో శనివారం నాకాబందీ కార్యక్రమంలో భాగంగా రాజకీయ నాయకుల ఇళ్లలో పోలీసులు సోదాలు నిర్వహించారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలను హెచ్చరిస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు కార్యక్రమంలో ఏఎస్‌ఐ హమానుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ఫ్యాక్షన్ గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా జీవించాలని ఎస్‌ఐ ఆంజనేయులు సూచించారు. శనివారం మండలంలోని చిన్నవడుగూరులో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇరు పార్టీల నాయకుల ఇళ్లు, కళ్లాల్లో తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలతో పోలీసులు

గార్లదిన్నె: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. శనివారం మండలంలోని మర్తాడులో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.ఈసందర్భంగా అనుమానిత ఇళ్లు, రౌడీషీటర్ల ఇళ్లు పోలీసులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు గౌస్ మహమ్మద్ బాషా, సాగర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుకు పంపుతామని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. శనివారం బొప్పేపల్లిలో నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామాంజనేయ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గేట్స్‌లో 'ఎఫ్‌డీపీ'

గుత్తి: గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ బయో డిగ్రేడబుల్ పాలిమర్స్ ఫర్ సస్టైనబుల్ అప్లికేషన్స్‌పై అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నట్లు గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి తెలిపారు. గేట్స్‌లో శనివారం ఆయన హ్యూమనిటీస్ అండ్ బేసిక్ సైన్సెస్ విభాగాధిపతులతో కలిసి ఎఫ్‌డీపీ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడారు. ఎఫ్‌డీపీ కార్యక్రమం పాలిమర్స్‌పై ఈ నెల 21 నుంచి 26 వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పాలిమర్ ప్యాకేజింగ్, ఆరోగ్య పరిరక్షణ రంగాల్లో వాడే పర్యావరణ హిత పదార్థాలపై తాజా పరిశోధనలు, ఆవిష్కరణలను పరిశోధకులు, అధ్యాపకులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, హెచ్‌ఓడీ హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.



గేట్స్‌లో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్యకర్తల సమావేశం జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని ఎద్దులపల్లిరోడ్డులో ఉన్న రహమత్ ఫంక్షన్‌హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యకర్తల సమావేశం జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్ రెడ్డి, రమావత్ రామకృష్ణనాయక్ శనివారం తెలిపారు. 13 నెలల కూటమి పాలన వైఫల్యాలను ఎండగట్టే ×రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో–బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, గుంతకల్లు సమన్వయకర్త వై వెంకట్రామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతిరెడ్డి తదితరులు హాజరవుతారన్నరు. కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు, వైఎస్ అభిమానులు, మేధావులు, ప్రజలు తరలిరావాలని వారు కోరారు.

హెల్మెట్ లేకపోతే జరిమానా

పెద్దపప్పూరు : హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడితే తొలివిడతగా రూ.1000లు జరిమానా విధిస్తామని, రెండో విడత పట్టుబడితే బండి సీజ్ చేస్తామని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని చిన్నపప్పూరు, గార్లదిన్నె, చీమలవాగుపల్లి, ముచ్చుకోట తదితర గ్రామాల్లో వాహనాల తనిఖీ చేసి, నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధిచారు.

జలధికి తరలిన చిన్న పీర్లు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో చిన్నపీర్ల పండుగ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి పీర్లు గ్రామంలోని పురవీధులు గుండా తిరుగుతూ భక్తులకు దర్శనం ఇచ్చాయి. సాయంత్రం పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేసి జలధికి తరలివెళ్లాయి. భక్తులు చక్కెర చదివించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి చర్యలు

బుక్కరాయసముద్రం: శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో అన్నదాతల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. శనివారం రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు అధ్యక్షతన రెడ్డిపల్లి కేవీకే, రేకులకుంట శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సంయుక్తంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు లాభదాయక వ్యవసాయ సలహాలు సూచనలివ్వాలన్నారు. జూలై నెలలో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. ప్రస్తుతం పంటలలో రైతాంగం చేపట్టాల్సిన ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఎరువులు యాజమాన్యం, గురించి వివరించారు. అనంతరం పలురువు శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలిచ్చారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ

కార్యక్రమంలో ఆత్మా పీడీ పద్మలత, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, రెడ్డిపల్లి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణ స్వామి, కీటక విభాగం శాస్త్రవేత్త జాహ్నవి, డాక్టర్ లక్ష్మిణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించండి



గుంతకల్లులో ప్రధానికి పోస్ట్‌కార్డుల ద్వారా విన్నవిస్తున్న విద్యార్థులు, ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు



పామిడిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సేవ్ ఆర్డీటీపై రిలేదీక్షలు చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: రాయలసీమతో పాటు తెలంగాణాలోని పలు ప్రాంతాల్లో గ్రామీణులకు విశిష్ట సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కు విదేశాల నుంచి వచ్చే నిధుల వినియోగానికి సంబంధించిన అనుమతులను(ఎఫ్‌సీఆర్‌ఏ) పునరుద్ధరించాలని ఆర్డీటీ పరిరక్షణ సమితి ప్రతినిధులు సుబ్రమణ్యం నాయక్, ఓబన్న, ప్రభాకర్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ప్రభుత్వ జూనియర్ విద్యార్థుల చేత ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని ప్రధాని మోదీని కోరుతూ పోస్ట్‌కార్డుల ద్వారా విన్నవించారు. కార్యక్రమంలో స్వామిదాసు, తావ్యానాయక్, ఏసుదాస్, సోమ్లానాయక్‌లు పాల్గొన్నారు.

ఆరోరోజుకు చేరిన సేవ్ ఆర్డీటీ రిలేదీక్షలు

పామిడి: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరణ కోసం ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో వంద గంటల రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజుకు చేరాయి. సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్, రాజ్‌కుమార్, సుధాకర్, జగదీశ్వర్‌రెడ్డి, కేశవ, ఓబుళపతి, నాగశేఖర్, నాగేష్ దీక్షలో కూర్చొన్నారు.

మైనార్టీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్/గుంతకల్లు రూరల్: ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. 'ఏపీఓబీఎంఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్' అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో సంప్రదించాలన్నారు. అలాగే గుంతకల్లు మండలానికి 29 యూనిట్ల రుణాలు మంజూరు అయ్యాయని, క్రిష్టియన్, మైనార్టీ నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నాగభూషణం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు టౌన్ బ్యాంక్ వార్షిక మహాసభ

గుత్తి: పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో ఉన్న వసుధ ఫంక్షన్ హాల్లో ఆదివారం టౌన్ బ్యాంక్ 102వ వార్షిక మహాసభ నిర్వహించనున్నట్లు టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జీలాన్, బ్యాంక్ సీఈఓ మహేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకు అధికారులు, డైరెక్టర్లు, ఖాతాదారులు, సిబ్బంది హాజరు కావాలన్నారు.

సంక్షిప్త సమాచారం

మద్యం బాటిళ్ల విక్రేత అరెస్టు

యాడికి: మండలంలోని గుడిపాడులో మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. గత కొంత కాలంగా గ్రామానికి చెందిన కంబగిరి రాముడు మద్యం బాటిళ్లను అమ్ముతున్నాడని సమాచారం రావటంతో శనివారం ఎస్‌ఐ వెంకటరమణ తన సిబ్బందితో గుడిపాడుకు వెళ్లి కంబగిరి రాముడిని అరెస్టు చేశారు. అతడి నుంచి 41 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

రెండు బైక్‌లు ఢీ –ముగ్గురికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని సచివాలయం వద్ద ఆర్‌ఎస్ రోడ్డులో శనివారంగుత్తికి చెందిన లక్ష్మిదేవి, ఆర్‌ఎస్‌కు చెందిన కుళ్లాయప్ప బైక్ వద్ద మాట్లాడుకుంటుండగా హోసూరుకు చెందిన నాగరాజు బైక్‌లో వచ్చి ఢీ కొన్నాడు. ప్రమాదంలో గాయపడిన ముగ్గురినీ స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికడదాం



గుంతకల్లులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌డీఓ, కమిషనర్

గుంతకల్లుటౌన్/గుత్తి/యాడికి/గార్లదిన్నె/పామిడి: ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసి మెరుగైన సమాజ నిర్మాణానికి ప్రజలంతా కంకణబద్దులు కావాలని ఆర్‌డీఓ శ్రీనివాస్, కమిషనర్ నయీమ్ అహ్మద్ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ఇబ్బందుల గురించి ప్రజలకు అవగాహన కలిస్తూ గుంతకల్లులో మున్సిపల్ సిబ్బంది, డ్వాక్రా సంఘాలు ర్యాలీ నిర్వహించాయి. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- గుత్తిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపల్, సచివాలయ , మెప్మా ఉద్యోగులు, సిబ్బంది, పద్మావతి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాషా, మెప్మా అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- గార్లదిన్నె మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వర్ణాం ధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించాలని ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.
- యాడికి మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం నుంచి శనివారం స్వర్ణాంధ్ర= స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈఓఆర్‌డీ శశికళ మాట్లాడుతూ దుకాణాల్లో ప్లాస్టిటక్ విక్రయిస్తే పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచు అనురాధ, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.
- పామిడిలోని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో డీడీఓ విజయలక్ష్మి మాట్లాడారు. వ్యాపార, వాణిజ్య కేంద్రాల నిర్వాహకులు ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఈసందర్భంగా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. అంతకుముందు ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే తేజోత్స్న, ఈఓఆర్డీ అశ్వర్థ నాయుడు, వీఆర్వో గోపాల్‌రెడ్డి, పంచాయితీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాఠశాలకు ఆర్వో వాటర్ మిషన్



బ్యాంకు మేనేజర్‌ను సత్కరిస్తున్న సర్పంచ్

గుంతకల్లు రూరల్: బ్యాంక్ ఆఫ్ బరోడా 118వ ఫౌండేషన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేనేజర్ దిలీప్ కుమార్ శనివారం మండలంలోని నెలగొండ ప్రాథమిక పాఠశాలకు రూ.15 వేలు విలువ గల ఆర్వో వాటర్ మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం హరి ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ పాటిల్ భాగ్యమ్మ, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో మేనేజర్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు.

పురాతన కట్టడాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విజయభాస్కర్

గుత్తి: గుత్తిలోని కోట కింద భాగంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో పురాతన కట్టడాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గేట్స్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్, కోట గైడ్ రమేష్ పురాతన కట్టడాలు, ప్రాముఖ్యత గురించి వివరించారు. పురాతన కట్టడాలైన ప్రాచీన సంపదలను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం గేట్స్ విద్యార్థులతో కలిసి కోటపైకి ట్రెక్కింగ్ నిర్వహించారు.

వీరన్నపల్లిలో వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న డాక్టర్ పరమేశ్వర

యాడికి: మండలంలోని వీరన్నపల్లిలో శనివారం యాడికి ప్రభుత్వ వైద్యాధికారి పరమేశ్వర 104 వైద్య సిబ్బందితో కలిసి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాం ప్రసాద్ గౌడ్, ఎంఎల్‌హెచ్‌పీ వరలక్ష్మి, ఏఎస్ఎం లక్ష్మి, ఆశా వర్కర్ జ్యోతి, 104 సిబ్బంది అనిల్, బాలాజి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌కుమార్ హెచ్చరించారు. శనివారం మండలంలోని వైటీ చెరువు గ్రామంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ మగ పిల్లవాడు కావాలనే ఉద్దేశంతో కొంతమంది తల్లిదండ్రులు అడపిల్లలను గర్భంలోనే చిదిమేస్తున్నారన్నారు. తద్వారా ఆడపిల్లల సంఖ్య క్రమంగా తగ్గిపోయి పరిస్థితి ప్రమాదకరంగా మారుతుందన్నారు. గర్భిణులు ఆస్పత్రుల్లోనే ప్రసవం పొందాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ధనలక్ష్మి, ఎంపీహెచ్‌ఈఓ వినయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కసాపురంలో అభివృద్ధి పనుల పరిశీలన



గంగా నిలయం సీలింగ్ పైభాగాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసులు

గుంతకల్లు రూరల్: దేవదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసులు శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. పూర్తిస్థాయి సౌకర్యాలతో ఆలయాన్ని తీర్చిదిద్దేందుకు మాస్టర్‌ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో శనివారం ఆయన మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా ఆలయ పరిసరాలను పూర్తిస్థాయిలో పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం ఎక్కడెక్కడ ఎటువంటి పనులు చేపట్టబోతున్నారో అడిగి తెలుసుకోవడంతోపాటు, ఆ పరిసరాలను, ఆలయంలో ప్రస్తుతం ఉన్న అద్దెగదులు, కల్యాణ మండపాలు, తదితర వాటిని పరిశీలించారు. ఆయన వెంట ఈఓ కె.వాణి ఇతర సిబ్బంది ఉన్నారు.

పరామర్శ



మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి భార్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దవడుగూరు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి భార్య నాగేశ్వరమ్మ గత కొద్ది రోజులు గా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. దీంతో ఆమె అనంతపురంలోని మెడికేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, సీనియర్ నాయకులు గూడూరు సూర్యనారాయణ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మండల నాయకులు పాల్గొన్నారు.

జేసీవి శిఖండి రాజకీయాలు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రేవతి



తాడిపత్రిటౌన్: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి శిఖండి రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రేవతి ధ్వజమెత్తారు. శనివారం అమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'పెద్దారెడ్డీ.. నువ్వు, నీకొడుకులు దమ్ముంటే తాడిపత్రికి రండి' అంటూ రెచ్చగొడతారు.. ఆ తర్వాత పోలీసులతో ఆయన్ను అడ్డుకునేది ప్రభాకర్‌రెడ్డే అన్నారు. వీటిని శిఖండి రాజకీయాలంటారన్నారు. పెద్దారెడ్డి కోడలు అర్చితరెడ్డి తాడిపత్రికి వచ్చి సభలో మాట్లాడితే శిఖండి రాజకీయాలు ఎలా అవుతాయంటూ ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ సభ ముగిసిన అనంతరం కౌన్సిలర్లతో కలసి జేసీ వచ్చి చెత్త వేశారు..పాడు చేశారంటూ మాట్లాడడం కేవలం జేసీ పబ్లిక్ స్టంట్ అని అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యక్రమం విజయవంతం కావడంతో తాడిపత్రిలో జేసీ పట్టుకోల్పోతున్నారన్న భావనలో పడ్డారన్నారు.

బిహార్ కూలీకి అరుదైన శస్త్ర చికిత్స

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో బీహార్‌వాసి గజోసదాకు శనివారం వైద్యులు అరుదైన చికిత్సను విజయవంతం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్ రాష్ట్రానికి చెందిన గజోసదా మండలంలోపి పీ కొత్తపల్లి పారిశ్రామిక ప్రాంతంలో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు ఇంగ్యూ ఇనల్ హెర్నియా సమస్యతో బాధ పడేవాడు. సమస్యకు సంబంధించి అతడు స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రిని సంప్రదించాడు. ఆస్పత్రి వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి పర్యవేక్షణలో శస్త్ర వైద్యనిపుణులు కమలాధర్, డాక్టర్ ఎల్లప్ప సమన్వయంతో శస్త్ర చికిత్సను విజయవంతం చేశారు. వైద్యబృందం పనితీరుపై స్థానికులు ప్రశంసల జల్లు కురిపించారు.

వృద్ధురాలి మృతి

గార్లదిన్నె: శింగనమల మండలంలోని తరిమెలకు చెందిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. తరిమెల గ్రామానికి చెందిన షేక్ మాబున్నీ (74) అనే వృద్ధురాలు మానసిక స్థితి సరిగా లేక ఈ నెల 11న కల్లూరు 44వ జాతీయ రహదారిపై నడుచుకుంటూ పామిడికి బయలుదేరింది. ప్రమాదవశాత్తు రోడ్డుపై కిందకు పడడంతో తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే వారు వృద్ధురాలిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిందని పోలీసులు తెలిపారు.

'ఆలయాభివృద్ధికి నిధులు కేటాయించాలి'

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులకు ఎంపీ నిధులను విడుదల చేయాలని ఈఓ కే.వాణి తదితరులు అనంతపురం ఎంపీ లక్ష్మీనారాయణను కోరారు. ఆలయ ఏఈఓ వెంకటేశ్వరుడుతో కలసి శనివారం ఎంపీని కలిసిన ఈఓ ఆలయ అభివృద్ధిలో భాగంగా చేపడుతున్న మాస్టర్ ప్లాన్‌ను ఆయనకు చూపించారు.

కార్మికుల సమ్మెకు ఎమ్మార్పీఎస్ మద్దతు

గుత్తి: సమస్యల పరిష్కారం కోసం ఏడు రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెకు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం మద్దతు ప్రకటించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్ , పలువురు నాయకులు శిబిరం వద్దకు వెళ్లి సంఘీ భావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజన్ ప్రసాద్ మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తమ మద్దతు ఉంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే దిగొచ్చి కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.